# కోడలు కావాలి




పానుగంటి లక్ష్మీరాఘవి

ఉదయాన్నే వార్తా పత్రికలు రెక్కలుకట్టుకుని ఇళ్లకు చేరాయి. కొందరు కాఫీ సేవిస్తూ, మరికొందరు కాఫీ కావాలంటూ ఇంకొందరు 'ఏదో పని చేస్తూ ఎవరికినచ్చిన పేజీ వారు చదువుకునే వేళ అది. అయితే ఆ రోజు అందుకు భిన్నంగా ఉంది పరిస్థితి. అందరినీ ఒక పేజీలోని వార్త ప్రత్యేకంగా ఆకర్షిస్తోంది.

ప్రతి వారూ అదే వార్తని చదివి, కళ్ళుపెద్దవి చేస్తున్నారు. చర్చిస్తున్నారు. ఆ పేజీలో ప్రత్యేక శైలిలో ఉన్న ఆ ప్రకటన ప్రతి ఒక్కరినీ ఆకట్టుకుంటోంది. ఆ వార్తనే అందరూ పదేపదే చదువుతూ, అర్థం చేసుకోవడానికి ప్రయత్నిస్తున్నారు. కొందరు తలపంకిస్తూ తలలు పట్టుకూర్చున్నారు.

ఇంతకీ అది.... ఓ ముఖ్యమైన వార్తా విశేష మేమీ కాదు, సరికదా అతి సాధారణ వార్త అంత కంటే కాదు.

కానీ.... అదో విశేషమైన, విచిత్రమైన ప్రకటన.

ఆ ప్రకటనా వివరాల్లోకి వెళ్ళాలంటే.... ఆ పేపర్లోని వివాహ ప్రకటనల్లోని నాలుగు కాలల బాక్స్‌ను ఆక్రమించి అందర్నీ ఆకర్షిస్తోంది ఆ విచిత్ర ప్రకటన.

అమ్మలక్కలు ఆ రోజు వంటా వార్పు పూర్తయితేనే తర్వాత సాగించే ముచ్చట్లలో 'ఇది విన్నవా!' అంటూ ఆశ్చర్యం వ్యక్తం చేస్తూ ఆ వార్త గురించి చర్చిస్తున్నారు.

మొత్తానికి ఆ ప్రకటన గల వార్తాపత్రిక చేరిన ప్రతి ఇంటా కూడా అదొక చర్చనీయాంశం అయిందనే చెప్పాలి.

ఇంతకీ ఆ ప్రకటన సారాంశం ఇలా ఉంది.

"కోడలు కావలెను".

"స్ఫురద్రూపి, పసిమిఛ్ఛాయ ఆకర్షించే రూపం గల నా బంగారు బాబుకు, ఫుల్లీ కంప్యూటరైజ్డ్ వధువు కోసమే ఈ అడ్వర్‌టైజ్‌మెంట్. ఆసక్తి ఉన్న తల్లిదండ్రులు ఈ నెల 15వ తేదీ నాడు ఈ క్రింది చిరునామాకు ఇంటర్వ్యూకు రావలెను. వయస్సు 30కి పైబడి ఉంటే చాలును".

ఆ ప్రకటనని చూసి బోలెడన్ని సందేహాలు, ఆశ్చర్యాలున్నూ.

"ఇదేదో బహు విచిత్రం, చిత్రాతి చిత్రం బాగానూ ఉంది" అని ఒకరంటే,

"చిత్రమా... విచిత్రమా, అర్థంకాందే అసలు". అని ఓ జవాబు, "అయినా ఇలాంటి ప్రకటనే విటి... ఏ వివరాలూ లేవు. కేవలం తన కొడుకుని గురించి వర్ణించుకోడమే సరిపోయింది, ఆవిడకి"... అని మరొకరూ, "ఆవిడో... ఆయనో, నీకెలా తెల్సూ" అనేదొకరూ.

"అదే తెలుసుకోవాలి" అన్నాడొకరు.

ఇక ఇంటింటా పరికిస్తే,

"ఏవండోయ్! ఈ ప్రకటన చూశారూ! నిన్ననే మనమ్మాయి కోసం పేపర్లో వేయిద్దాం అంటే, ఈ రోజు పేపర్లోనే ఎవరో వాళ్ళ అబ్బాయి కోసం వేసేశారు. కానీ ఇది చాలా గమ్మత్తుగా ఉందిమరి" అని ఓ యిల్లాలు అనగానే

"ఏవిటో ఆ ప్రకటన" అన్నాడతను.

"ఇదిగో చూచండిది" అంటూ ఇవ్వగానే, అందుకొని చదివి, "అయినా, మనమ్మాయికి 30 దాటలేదుగా, పనికి రాదేమో" అన్నాడు.

"ఫర్వాలేదండీ. వెళ్ళిచూసి వద్దాం. ఏమో, అదృష్టం బావుంటే, అన్నీ కలిసొస్తే, ఆ ఒక్క ఏడూ అడ్డం కాకపోవచ్చు. దీనికింకా ఇరవై తొమ్మిదే అని ఆలోచించకండి. ప్రయత్నిస్తే నష్టంలేదు" అందామె.

"సర్లే వెళ్ళొద్దాం" నిరాసక్తంగానే అన్నాడతను.

ఇక మరో లో....

"రజనీ... ఈ ప్రకటన చూశావే! భలే చిత్రమన్పిస్తోంది" అని సావిత్రి రజనిని పిల్చి చూపించింది.

"చూశాన్లేమ్మా అయినా వయసొక్కటే వేస్తే చాలా... మిగతా సంగతులన్నీ ఏమయ్యేట్లు" అంది కూతురు రజని.

"ఆ... సర్లేవే, ఈ రోజుల్లో చదువూ సంధ్యా లేకా, ఉద్యోగం సద్యోగం లేకా, ఏ ఆడపిల్లా ఉండటమే లేదుగా! అంచేత వాళ్ళేమీ కోరలేదేమో!"సమర్థించింది తల్లి.

"అమ్మా! నీకంతా మంచినాళ్ళుగానే కన్పిస్తాలే" అంది రజని.

"ఏదేమైనా, మనం ఆ రోజు వెళ్ళటమే మంచిది. అన్నీ అనుకూలంగా అన్పిస్తేనే ప్రొసీడ్ అవుతాం, లేకుంటే లేదు" అని సావిత్రి అనడంతో "సరే" అనక తప్పలేదా కూతురికి.

ఇంకో చోట సంవాదం మరోలా ఉంది.

"అన్నయ్యా! ఇది చూశావా, ఏవిటోలా లేదూ!" అంటూ పేపర్‌తీసి వాసూకి ఇచ్చింది ప్రతిమ.

"ఇదా, అర్థంకాకపోవడానికే వుందీ యిందులో" అన్నాడు.

"అన్నిటిలా కాకకుండా, చాలా విభిన్నంగా లేదూ!"

"ఏవీలేదు. ఏదో వెరైటీగా కన్పిస్తే అందర్నీ ఆకర్షించొచ్చుగదాని అలా యిచ్చివుంటారు తల్లీ" తేల్చిచెప్పాడు.

"నువ్వెప్పుడూ యింతేలే" అంది ఆ చెల్లెలు.

ఆపైన... మరో ఇంట్లో సంచలన మిదీ....

"ఇది చూశావమ్మా రమ్యా!" అంటూ తండ్రి పిలవటంతో, అక్కడి కొచ్చింది రమ్య. "వీళ్ళెవరో "కోడలు కావాలి" అంటున్నార్ల చూడు" అని పేపరందించబోతే..., "ఎవరైనా, వధువు లేక వరుడు అంటూరు గానీ ఇలా..." అంటుంటే, "అంతే కాదూ... ఫుల్లీ కంప్యూటరైజ్డ్" అని మరీ అంటున్నారుగా! నేనిందాకే చూశాను. పెద్ద పెద్ద అక్షరాలతో, చాలా పెద్దపెద్ద ఆర్భాటంలాగా ఇచ్చారు వాళ్ళెవరో" అంది.

"ఏవిటో నమ్మా! రోజు రోజుకీ— రోజులు మారిపోతున్నాయ్. అలాగే మనుషులూ చాలా మారిపోతున్నారు" అన్నారు రావ్‌గారు.

"అందుకే ఈ ప్రకటనలూ మారిపోతున్నాయి" అంది రమ్య.

"ఇదేదో సరిగా తేలాలంటే, వెళ్ళి చూడాల్సిందే" అని ఇద్దరూ కలిసి నిశ్చయించారు.

మొత్తానికి ఆడపిల్లల తల్లిదండ్రులు చాలా మంది ఆ పదిహేనో తేదీ కోసం ఎదురు చూస్తున్నారు.

* * *

మహారచన చేస్తున్న సృజితాదేవి నోటికి అడ్డం పెట్టుకుని ఆవులిస్తూ పెన్నుకేప్ మూసేసి, నిద్రకు ప్రయత్నించింది తెల్లారితే పదిహేనవ తేదీ అనుకుంటూ నిద్రలోకి జారిపోయింది.



### థ్రిల్

"నిన్ను తాకితేనే కరెంటు షాక్ కొట్టినంత ఫీలింగ్ కలుగుతుంది కదా, 'మరి నీతో సంసారసుఖం: అనుభవిస్తుంటే ఎలా ఉంటుందో ఆశగా అన్నాడు ప్రియుడు.

"ఏముందీ! ఎయిడ్స్ సోకినంత థ్రిల్లింగ్ పొందుతావంతే" సింపుల్‌గా చెప్పేసింది ప్రియురాలు.

### హెయిర్ ఆయిల్

భార్య: ఏమండీ మీ కంపెనీ హెయిర్ ఆయిల్... ప్రకటనలో మోడల్‌గా పనిచేస్తున్న అమ్మాయిజుత్తు భలే ఉంగరాలు ఉంగరాలుగా ఉంటుంది!

భర్త: అది ఆ అమ్మాయి నిజం జుత్తు కాదు! వెర్రిమొగమా అని ఓ ఫారిన్‌విగ్! ఈ రహస్యం ఎవ్వరికీ చెప్పక నీ హృదయంలో దాచుకో ప్లీజ్.



అనుకున్న 15వ తేదీ రానే వచ్చింది.

ప్రకటన మీద ఆసక్తి కనపర్చిన వారంతా ఆ రోజు, ఇంటర్వ్యూ టైముకి అక్కడికి వచ్చి చేరారు.

ఇంటర్వ్యూకి సమయం దగ్గరపడుతూండగా చాలామందిలో ఉత్సుకత ఎక్కువౌతోంది. అక్కడున్న ప్రతి ఒక్కరినీ జాగ్రత్తగా 'ఇక నా ఛాన్స్ ఎప్పటికి వస్తుందా' అన్న ఆతృతలోద్వేత్తకమౌతోంది అభ్యర్థులంతా అడగకపోయినా, అవసరం వుంటుందేమోనని, ఫోటోలు—జాతకాలు బయో—డేటా వగైరా వివరాలన్నీ వెంటతెచ్చారు కొందరు. చాలామంది ఆ ఇంటి హోదా అంతస్తు అంచనావేస్తూ కలయజూస్తున్నారు. ఆస్తిపాస్తుల వివరాలతోసహా వచ్చినిలిచిన వాళ్ళూ—తమ అంతస్థుతో అక్కడి పరిస్థితిని పోల్చుతూ ఎవరు గొప్పా?' అన్నట్టు అంచనాలు వేస్తున్నారు. క్షణాలు గడుస్తున్నాయి. ఓ క్షణం సంవాదం—ఓ క్షణం నిశ్శబ్దం.

అనేక అనుమానాలూ...శతకోటి సందేహాలూ.

అవి నివృత్తి చేసేవారే కన్పడటం లేదక్కడ.

ఇంటర్వ్యూ కోసం అమ్మాయిలకి తర్ఫీదు నిచ్చేవారు కొందరు, తమకి తామే రిహార్సల్స్ చేసుకొనే వారు కొందరు, కాగితాలూ అవీ సరిచూసుకొనే వారింకొందరూ, అసహనంగా పచార్లు చేస్తున్నవారు మరికొందరూ ఇలా ఉంది హడావిడి.

అంతలోనే ఒక డోర్ తెరచుకొందక్కడ. ఆ శబ్దానికి చూపులన్నీ ఆ గుమ్మంవైపే మరలాయి. సృజితాదేవి చిరునవ్వుతో ప్రత్యక్షమైంది. ఆమె నాలుగు అడుగులు ముందుకు వేసింది.

"ఎవరీమె?" అర్థం కాలేదెవరికీ.

"గుడ్ మార్నింగ్. నా పేరు సృజితాదేవి" అంది ముకుళిత హస్తాలతో.

"గుడ్ మార్నింగ్" ముక్త కంఠంతో బదులిచ్చారంతా. కొద్దిగా గొంతు సవరించుకుంది సృజితాదేవి.

"మీరంతా పేపర్లో... ఆ ప్రకటన చూసి వచ్చారనుకుంటాను" అనగానే ఇదేం ప్రశ్న? అన్నట్టు ముఖాలు చిట్లించారు చాలామంది.

"నా పేరు సృజితాదేవి. ఆ ప్రకటనని ఇచ్చింది నేనే." చెప్పింది మెల్లగా!

'ఓహో! ఇటువంటి ప్రకటనల్నీ, చిత్ర విచిత్రాల్నీ చిన్నప్పటి నుండీ సృజించే అలవాటు కాబోలు. అందుకే ఆ పేరు పెట్టుంటారు మీ వాళ్ళు." వెనుకనించీ కీచుగా అరిచారెవరో. నవ్వొచ్చింది సృజితకి. అయినా తమాయించుకుని 'ఇట్సాల్‌రైట్' అన్నట్టు తలపంకించింది.

"ఇప్పుడే ఇంటర్వ్యూ! మీరంతా సిద్ధమేనను కొంటాను" అడిగింది.

"ఒక్కొక్కరినే లోపలికి రమ్మంటారా మేడమ్?" ప్రశ్న.

"ఆ అవసరం లేదు, ఒక్కొక్కరికీ విడివిడిగా ఇంటర్వ్యూలు ఉండవు. ఇప్పుడు నేనడగబోయే ప్రశ్నలకీ, మీరిచ్చే సమాధానాలను బట్టి రిజల్ట్ ఉంటుంది" అని అనగానే గుసగుసలు బయల్దేరాయి.

"అయితే, ఇది గ్రూప్ ఇంటర్వ్యూ అన్నమాట. ఇదేదో చాలా ఆశ్చర్యంగా ఉందే?" అన్నారు ఒకరు.

"అసలు, 'ఆశ్చర్య'మే ఈ ఇంటర్వ్యూకి స్పెషల్ అట్రాక్షన్ మరోడైలాగ్. 'సైలెన్స్!' అన్నట్టుగా గొంతు సవరించుకుని చిన్నగా దగ్గింది సృజితాదేవి. అంతా నిశ్శబ్దం.

"సరే, వినండి. కాబోయే నా కోడలి గురించి, నేను మిమ్మల్ని అడగబోయే ప్రశ్నలలో, క్వశ్చన్ నెంబర్ వన్... భర్త నిద్రించే వేళలో ఫోన్ వచ్చినా, అతిథులు వచ్చినా, అతడికి నిద్రాభంగం కలగరాదంటే, భార్య ఏంచేయాలి?"

"ఓహో... బావుంది, బావుంది" వెనక నుంచి అరిచారెవరో.

"ఇంతమందిలో దీనికి ఆన్సరెవరివ్వాలిటా?" మరో అరుపు.

"క్వశ్చన్ నెంబర్ టూ... భర్తకి బాగా కోపం వచ్చినప్పుడు భార్య ఏం చెయ్యాలీ, ఏం చెయ్యకూడదు?"

"అద్భుతం... పరమాద్భుతం" వ్యంగ్యంగా అన్నారెవరో.

"క్వశ్చన్ నెంబర్ త్రీ... భార్యంటే ఎలా ఉండాలీ, భర్తని ఎలాగ చూసుకోవాలీ" అనగానే, ఆమెని మధ్యలోనే ఆపుచేస్తూ, "ఆగవమ్మా, ఇంతకీ అంత అపురూప వర్ణనలతో వుండే ఆ అబ్బాయి ఎక్కడా?" అని అడిగారొకరు.

వెంటనే "ఫోటో చూపిస్తానుండండి." అంటూ, పర్సులోంచీ తీయబోతుంటే, "ఓహ్... ఏ అమెరికాలోనో ఉండి ఉంటాడు. వచ్చేలోగా ఈవిడ సెలెక్ట్ చేసి ఉంచుతుందేమో" అనీ, "ఈ రోజుల్లో ఇవి మామూలేగా" అనీ "ఆయనగారొచ్చేదాకా, ఈవిడ సెలెక్ట్ చేసిన నాల్గయిదు సంబంధాలవాళ్ళూ, తలలు బద్దలు కొట్టుకుంటూ ఎదురు తెన్నులు చూడాలా? అని తలో రకంగా సణుగుళ్ళు వినిపించాయి.

"ఇదిగో మా అబ్బాయి ఫోటో" తీసి చూపింది సృజిత. ఫోటో చూసిన వాళ్ళంతా అదిరిపడ్డారు.

"ఏవిటీ... ఐదారేళ్ళ వాడికోసం ఇప్పట్నించీ పెళ్ళి ప్రయత్నాలా! పైగా ముప్ఫయేళ్ళ, ఫుల్లీ కంప్యూటరైజ్డ్ పిల్ల కావాలా?టట ఆవేశంతోనూ, అసహనంతోనూ నిరసన ధ్వని వెళ్లవించి ప్రశ్నల బాణాలు విసిరారు.

"పొరపడ్డారు. ఆసక్తి కలిగిన ముఫ్ఫయేళ్ళ తల్లిదండ్రులు సంప్రదించాలి అన్నాను. ఎందుకన్నానంటే, ఇప్పుడీ ప్రశ్నలకీ మీరు జవాబులు కరెక్ట్‌గా చెబితే, మీ పిల్లకి అందుకనుగుణంగా తీర్చిదిద్దుతారని, నా కొడుకు పెద్దవాడయ్యే సరికి, సరిగా వాడికి కావాల్సిన పిల్లే వస్తుందని నా ఆశ". వివరించింది. వారి ఆవేశాన్ని లెఖ్ఖ చెయ్యనట్టుగా చెప్పింది.

"ఏడ్చినట్లుంది నీ ఆశ. ఫుల్ల విరుపుగా ఈసడించారు.

"ఎందుకొచ్చిన మెలికలివన్నీ. జనంతో పరాచికాలా?

"దేనికైనా అర్థం పర్థం ఉండాలి" మరొకరి చిరాకు.

"చాల్చాలేవమ్మా! పెద్ద ఆశతో, ఉరుకులూ, పరుగులూ మీద వచ్చాం. ఇదా నీ ఇంటర్వ్యూ. ఇలాంటి వెధవ ప్రాక్టికల్ జోక్స్ వెయ్యడానికి సిగ్గులేదూ? తీక్షణంగా అడిగిందొక ఇల్లాలు.

"నువ్వూ, నీ ఇంటర్వ్యూ కాదుగానీ, మాటైమంతా వేస్ట్.

"అసలు మా గురించి ఏమనుకొంటున్నావ్" అని అనగానే...

"ఆడపిల్లల తల్లిదండ్రులంటే, అంత చులకనగా వుందా... ఇలాంటి వాళ్ళకి, వదలకూడదు, ఊ... పదండి ముందుకు బుద్ధి చెప్పండి గట్టిగా" అని అంటూ, అంతా ఏకమై ఆమె మీదికి లంఘించారు. వద్దు... వద్దు... అని అరుస్తున్న సృజితకు ఉలిక్కిపడి లేచి కూర్చుని అయోమయంగా కలయజూసింది. ఇది కలా? తనలో తనే నవ్వుకుంది. భర్తతో అంతక్రితమే గొడవపడి, అమిత వ్యధ చెందిన తాను, తన చిన్నారి కొడుక్కి అయినా కలతలు లేని కాపురం తనే సృష్టించి యివ్వాలని భావిస్తూ నిద్రలోకి జారుకుంది. కలత నిద్రలో ఇలాంటి కలవచ్చినందుకు నవ్వుకుంది.

★



### ప్రార్థన

★ శారద టీచర్ పిల్లలచే ప్రార్థన చేయిస్తున్నారు.

"భగవంతుడా నీవే మాకు తల్లివీ, తండ్రివీ....

'అది అమ్మా, నాన్నలేని వాళ్ళకు'. మనీష చెవిలో మెల్లగా అంది అనూష.

—బి. చంద్రశేఖరయ్య, టీచర్
రామసముద్రం.